
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 23 డిసెంబరు 2024 | 5







ఎన్టీఆర్ బీచ్‌లో పారా మోటరింగ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

ఆకాశంలో పర్యాటకుడి విహంగ వీక్షణ

నరక ప్రయాణం



పిఠాపురం-సామర్లకోట మధ్య గల 13కిలోమీటర్ల రహదారిలో 9కిలోమీటర్ల మేర రోడ్డు దుస్థితి ఇలాగే

నిత్యం వంద గ్రామాలు, మూడు పట్టణాల ప్రజలు, వందల సంఖ్యలో వాహనాల రాకపోకలతో అత్యంత రద్దీగా ఉండే రహదారి అది. ఇప్పుడు అదే రోడ్డు ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తోంది. అడుగడుగునా గోతులతో ప్రతి రోజు పదికి పైగా ప్రమాదాలు, గోతుల్లో పడి మరమ్మతులకు గురై ఆగిపోయే వాహనాలు. ఇప్పుడు ఆ రహదారిపై ప్రయాణానికి భయపడి ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటున్నారు. ప్రధానమైన ఈ రహదారిని విస్తరించి అభివృద్ధికి కేంద్రం ఇచ్చిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించడమే గాక కనీస మరమ్మతులు కూడా చేపట్టని ఫలితం ప్రజలకు శాపంగా పరిణమించింది. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో అర్ధంతరం పనులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా తాత్కాలిక మరమ్మతులతో కొంత ఊరట లభిస్తుందనుకుంటే నిలిచిపోయిన పనులు ప్రారంభిస్తామంటూ అధికారులు చెప్పడం మినహా రిపేర్లు చేపట్టే ఆలోచన కనబడడం లేదు.

- కేంద్రం రూ.15కోట్లు ఇచ్చినా ముందుకు సాగని పనులు
- నిధులు దారి మళ్లించిన అప్పటి వైసీపీ ప్రభుత్వం
- ఐదేళ్లలో కనీస మరమ్మతులు కరవు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనదారుల రాకపోకలు
- బిల్లులు చెల్లించక పనుల నిర్వహణకు ముందుకు రాని కాంట్రాక్టర్
- పిఠాపురం-సామర్లకోట రహదారితో తప్పని అగచాట్లు

(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)

పిఠాపురం-సామర్లకోట మధ్య 13కిలోమీటర్ల పొడవునాగల ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి మీదుగా పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం పట్టణాల ప్రజలతోపాటు పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ రూరల్, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు చెందిన 100 గ్రామాల ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. సామర్లకోట రైల్వేజంక్షన్ కావడం, రాజమహేంద్రవరం లేదా మధురపూడి విమానాశ్రయం వెళ్లేందుకు ఇదే ప్రధానమార్గం. సూరంపాలెం, రాజమహేంద్రవరం ఇంజనీరింగ్, పీజీ కళాశాలలు వెళ్లేందుకు విద్యార్థులు, అందులో పనిచేసే ఉద్యోగులు ఇదే మార్గంలో ప్రయాణం సాగిస్తూ ఉంటారు. ఇందులో కుమారపురం నుంచి సామర్లకోటవరకూగల 11కిలోమీటర్ల పొడవునా రహదారి గోతులమయంగా మారింది. కుమారపురం గ్రామ పరిధి వరకూ ఇటీవల మరమ్మతులు నిర్వహించారు. ప్రస్తుతం కుమారపురం గ్రామ శివారు నుంచి కందరాడ, ఎఫ్‌కేపాలెం, జల్లూరు గ్రామాల మీదుగా సామర్లకోట వరకూగల రోడ్డు అడుగడుగునా భారీ గోతులు, రాళ్లు లెగిసి అత్యంత అధ్వానస్థితికి చేరింది.

కేంద్రం నిధులు ఇచ్చినా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే ప్రధాన రహదారిగా ఉన్న పిఠాపురం-సామర్లకోట రోడ్డును ఎఫ్‌కేపాలెంనుంచి సామర్లకోట వరకూ 8.20కిలోమీటర్ల మేర విస్తరించి అభివృద్ధి చేసేందుకు, అవసరమైన చోట్ల కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం భారతమాల ద్వారా రూ.15కోట్లు నిధులు విడుదల చేసింది. ఐదేళ్ల క్రితం నిధులు విడుదల చేయగా నవంబరు 2020లో ఈ పనులకు కేంద్రమంత్రి గడ్కరీ, అప్పటి సీఎం జగన్ శంకుస్థాపన చేయగా, స్థానికంగా వైసీపీ ప్రజాప్రతినిధులు ఆ పనులు నిర్వహించారు. పనులు అప్పగించిన కాంట్రాక్టరు ముందుగా కొన్ని కల్వర్టు పనులు, సామర్లకోట శివారు బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేశారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించడంతో కాంట్రాక్టర్‌కు చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో పనులను నిలిపివేశారు.బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసినా అప్రోచ్‌లు నిర్మించలేదు. అధికారులు బతిమాలి తాత్కాలిక అప్రోచ్‌లు ఏర్పాటు చేయించారు. ఈ పనులు నిలిచిపోయి రెండేళ్లు కావస్తోంది. ఒక్క అడుగు ముందుకు పడలేదు.

ప్రజలకు కష్టాలు.. నిత్యం ప్రమాదాలు

రోడ్డు అభివృద్ధి పనులు నిలిచిపోవడం, ఐదేళ్ల వైసీపీ పాలనలో మరమ్మతులు నిర్వహించకపోవడంతో పిఠాపురం-సామర్లకోట మధ్యగల రహదారి పూర్తిగా గోతులమయంగా మారింది. 9 కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా అధ్వాన స్థితికి చేరింది. పలుచోట్ల భారీ గోతులు ఉండడం, కొన్నిచోట్ల రాళ్లు లెగిసిపోవడం, కోతకు గురికావడంతో ఈ రోడ్డు ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. ప్రతిరోజూ కనీసం పదికిపైగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనదారులు గాయపడడం నిత్యకృత్యంగా మారింది. ప్రజలు రాత్రయిందంటే ప్రయాణాలు మానుకుంటున్నారు. గతంలో వాహనాలతో అత్యంత రద్దీగా ఉండే ఈ రహదారిపై ఇప్పుడు సాధారణస్థాయిలోనే తిరుగుతున్నాయి. ఉందూరు-తిమ్మాపురం జంక్షన్ మీదుగా పిఠాపురం వస్తున్నారు. ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తున్నారు.

మరమ్మతులు నిర్వహిస్తారనుకుంటే..

వైసీపీ ఐదేళ్ల పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఈ రహదారికి కూటమి ప్రభుత్వంలో మోక్షం లభిస్తుందని ప్రజలు ఆశించారు. కనీసం గోతులయిన పూడ్చి తాత్కాలికంగా మరమ్మతులు నిర్వహిస్తారని భావించారు. శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు నిధులు మంజూరై ఉండడం, పనులు మధ్యలో నిలిచిపోవడంతో వాటిని ప్రారంభిస్తే మరమ్మతులు అవసరం ఉండదని భావించిన ఆర్అండ్‌బీ అధికారులు ఈ రోడ్డును విస్మరించారు. కేవలం పిఠాపురం-కుమారపురం మధ్య మాత్రమే మరమ్మతులు చేపట్టి భారతమాల నిధులతో చేపట్టే 8.20కిలోమీటర్ల మేర మరమ్మతులను విస్మరించారు. దీంతో ప్రజల కష్టాలు మరింత అధికమయ్యాయి. ప్రైవేటు వాహనదారులు గోతుల్లో తాత్కాలికంగా రాళ్లు, క్రషర్ బూడిద, గ్రావెల్ వేస్తున్నా రెండు, మూడురోజులకే పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోంది. ముందు అత్యవసర మరమ్మతులు నిర్వహించి అనంతరం అర్ధంతరంగా నిలిచిపోయిన పనులను చేపట్టేలా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ రోడ్డు దుస్థితిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



పిఠాపురంలోని జల్లూరు-సామర్లకోట మధ్య గోతులమయంగా మారిన రోడ్డు

కాకినాడ బీచ్‌లో.. పారా మోటరింగ్

సర్పవరం జంక్షన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందిన కాకినాడ బీచ్‌ను మరింత పర్యాటకాభివృద్ధి సాధించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. క్రిస్మస్, సంక్రాంతి పండుగల్లో భాగంగా నెలరోజుల పాటు కాకినాడ రూరల్ ఎన్టీఆర్ బీచ్‌లో నిర్వహించే సాగరతీర ఉత్సవాలను ఆదివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అడ్వెంచర్ సంస్థ సహకారంతో పారా మోటరింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్ సందర్శనకు వచ్చే పర్యాటకులకు మధురానుభూతి కలిగించేలా పలు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు వాటర్ స్పోర్ట్స్ ఏటీవీ వెహికల్స్, సముద్ర జలక్రీడల్లో భాగంగా స్పీడ్ బోట్, బీచ్ ఫ్రంట్ స్పోర్ట్స్, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడలు నిర్వహించేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. జాతీయ, అంతర్జాతీయస్థాయి వాటర్ స్పోర్ట్స్ క్రీడలు ఎన్టీఆర్ బీచ్‌లో నిర్వహించాలని వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు బలరాం నాయుడిని కోరారు. పారా మోటరింగ్‌ని తిలకించేందుకు విచ్చేసిన రష్యా పర్యాటక బృందం సభ్యులు వాటర్ స్పోర్ట్స్ నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసకుమార్, కౌస్తవబక్షి, గ్రామ కార్యదర్శి పిడుగు పాండు రంగారావు, ఆర్‌ఐ భవానీ, జనసేన నాయకులు సోదె ముసలయ్య, శెట్టి బాబూరావు, తాటికాయల వీరబాబు, గేదెల చిన్నారావు, పాండ్రంకి రాజు, బండారు మురళీ పాల్గొన్నారు.



కాకినాడ బీచ్‌లో ఆదివారం సెలవు దినం కావడంతో సందడి చేస్తున్న పర్యాటకులు

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జరుగుతుందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

ఘనంగా ముగిసిన పోలీస్ స్పోర్ట్స్ మీట్



బహుమతి ప్రదానం చేస్తున్న ఎస్పీ దంపతులు

కాకినాడ క్రైం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పోలీస్ వార్షిక గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్- 2024 ఆదివారం ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా థర్డ్ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ హాజరయ్యారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, కమాండెంట్ దీపికా పాటిల్ దంపతులు విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, మెమెంటోలు అందజేసి అభినందించారు. అద్భుతమైన క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిన సిబ్బందిని అభినందిస్తూ విధినిర్వహణలో కూడా జిల్లాను విజయపథంలో నడపాలన్నారు. ఈ క్రీడల్లో కాకినాడ జిల్లా ఏఆర్ జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. ముగింపు వేడుకల్లో ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాస్, పెద్దాపురం ఎస్‌డిపిఓ శ్రీహరి రాజు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీరామకోటేశ్వరరావు, ఆర్ఐలు నరసింహమూర్తి, వెంకట్రావ్, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాలకు.. ఎన్నికలు.. ఇప్పట్లో లేనట్టే?



- పర్సన్ ఇన్‌చార్జ్‌ల గడువు ఆరు నెలలు పొడిగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

పెద్దాపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలకు ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయాఅని కూటమి కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు. ఒకవేళ ఎన్నికల నిర్వహించకపోతే గత ప్రభుత్వం మాదిరిగా సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తారనే ప్రచారం జరిగింది. ఆ ప్రచారాలకు చెక్ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గడచిన జూలైలో సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా అధికారులను నియమించింది. వారి ఆరు నెలల పదవీ కాలం పూర్తవుతుండడంతో తిరిగి పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఈనెల 19న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 72 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలున్నాయి.

కుంటుపడుతున్న పాలన..

సహకార సంఘాలకు పాలక వర్గాలు లేకపోవడంతో పాలన కుంటుపడుతోందనే విమర్శలున్నాయి. సకాలంలో పంట రుణాలు అందే పరిస్థితులు లేక రైతులు పంటల సాగు కోసం ప్రైవేటు అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. జిల్లాలోని సహకార సంఘాల్లో కంప్యూటరైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. దీంతో అధికారులకు సమయం కేటాయించడం వీలు కావడం లేదు. సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఆయా సహకార సంఘాల్లో కీలక నిర్ణయాలు తీసుకోవడం కష్టంగా తయారైంది. రెండు నుంచి మూడు సంఘాలకు ఒకరే పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఉండడంతో పాలన సక్రమంగా సాగడం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి.

కూటమి నాయకుల్లో నిరుత్సాహం..

సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జ్‌ల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించడంతో ఇప్పట్లో సహకార ఎన్నికలు లేనట్లేనా అన్ని ప్రశ్న వినిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారని అందరూ భావించారు. ఒకవేళ ఎన్నికలు నిర్వహించడం ఆలస్యమైతే గత ప్రభుత్వంలో మాదిరిగా త్రిసభ్య కమిటీలను నియమిస్తారని, తమకు నామినేటెడ్ పదవులు వస్తాయని పలువురు కూటమి నాయకులు ఆశించారు. దీనికి సంబంధించి ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జ్‌ల పదవీకాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూటమి నాయకుల్లో కొంత నిరుత్సాహం కలిగించింది.

ఆదేశాల వచ్చినమాట వాస్తవమే

సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జ్‌ల పదవీ కాలం గడువు మరోఆరు నెలలు పొడిగించిన మాట వాస్తవమే. ప్రభుత్వం ఈవిషయంపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 27 నుంచి వచ్చే ఏడాది జూన్ 26 వరకూ పొడిగించింది.

-జి.వెంకటకృష్ణ, జిల్లా సహకార అధికారి, కాకినాడ

ఎంపీ సానా సతీష్‌కు ఘనస్వాగతం

లోపలి పేజీల్లో..



కాకినాడలో సానాకు ఘనస్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

ర్యాలీగా వెళ్తున్న రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, మంత్రి సుభాష్, ఇతర టీడీపీ నేతలు తదితరులు

సముద్ర జలాల్లో .. మత్స్యజాతుల వృద్ధికి కార్యాచరణ

- మత్స్యశాఖ కమిషనర్ డోలాశంకర్ వెల్లడి 7

జిల్లా ప్రధానోపాధ్యాయ సంఘం కార్యవర్గ సమావేశం

కాకినాడ రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధానోపాధ్యాయ సంఘం కార్యవర్గ సమావేశాన్ని కాకినాడలో సంఘ జిల్లా అధ్యక్షుడు కూర్మారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ప్లస్-2 పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యకు సంబంధించి పూర్తిస్థాయి నియామకాలను ప్రభుత్వం చేపట్టాలని కోరారు. సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఉపవిద్యాశాఖాధికారులు, డైట్ సీనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. జిల్లాలోని ఉమ్మడి పరీక్షల విభాగాన్ని బలోపేతంచేయాలని కోరారు. సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి పి.పుల్లయ్య, రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణ, సంఘ బాధ్యులు చెవ్వూరి రవి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సత్తిబాబు పాల్గొన్నారు.

పనులు పరుగులు!

- కాకినాడ పోర్టు-రాక్ సిరామిక్ రోడ్డుకు మహర్దశ
- వేగవంతంగా నాలుగు లైన్ల రహదారి నిర్మాణం
- అచ్చంపేట సెంటర్‌లో భారీ ఫ్లై ఓవర్ బ్రిడ్జి
- రూ.557కోట్లతో 26 కిలోమీటర్ల మేర సువిశాలమైన రహదారి కనెక్టివిటీ



సామర్లకోట రాక్ సిరామిక్ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి

సర్పవరం జంక్షన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టుకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించి తద్వారా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి పథంలో నిలిపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. కాకినాడ సముద్రతీరం కేంద్రంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గతిశక్తి పథకం కింద కేంద్రం రూ.557కోట్ల నిధులతో నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. కాకినాడ పోర్టు ఏడీబీ రోడ్డు నుంచి రాక్ సిరామిక్ వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు జోరందుకున్నాయి. 2025, జూన్ నాటికి ఈ రహదారిని ప్రారంభించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకు అనుగుణంగా నిర్మాణ పనులు జోరందుకున్నాయి. ప్రస్తుతం 50 శాతం మేర నిర్మాణ పూర్తయ్యాయి.

నాలుగులైన్ల రహదారి

కాకినాడ యాంకరేజీ పోర్టు, డీప్ వాటర్ పోర్టుకు రాష్ట్రంలోని ఇతర జిల్లాలనుంచే కాక ఒడిశా, పశ్చిమ బెంగాల్, తెలంగాణా, కేరళ తదితర రాష్ట్రాల నుంచి నిత్యం వందలాది లారీల ద్వారా బియ్యం, నూకలు, గ్రానైట్ రాళ్లు, ఐరన్ ఓర్, సిమెంట్ తదితర సరుకు ఎగుమతి, దిగుమతుల రవాణా కోసం సామర్లకోట నుంచి కాకినాడ ఏడీబీ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. సామర్లకోట నుంచి కాకినాడ పోర్టు వరకు రోడ్డు విస్తరణకోసం రెవెన్యూ అధికారులు భూమిని గుర్తించి రైతులకు పరిహారం చెల్లించి భూసేకరణప్రక్రియ గతంలోనే పూర్తి చేసి నేషనల్ హైవే అథారిటీకి అప్పగించారు. కాకినాడ యాంకరేజీ పోర్టు నుంచి పెద్దాపురం రాక్‌సిరామిక్ వరకు 26 కిలోమీటర్ల మేర రోడ్డు ఆధునికీకరణ, ఆర్వోబీలు, రోడ్డు కం బ్రిడ్జిలు, పీయూవోలు నిర్మాణం కోసం రెండు ప్యాకేజీల కింద నాలుగు లైన్ల రహదారి కోసం కేంద్రం అజాదీకాఅమృత్ మహోత్సవ్‌లో భాగంగా గతిశక్తి పథకం కింద రూ.557కోట్లు మంజూరు చేసింది. రెండు ప్యాకేజీల కింద నిర్మాణ పనులు డిసెంబరు 2022లో ప్రారంభించారు. ఇందులో మొదటి ప్యాకేజీ కింద కాకినాడ రూరల్ మండలం ఏడీబీ రోడ్డు గోకుల్ గార్డెన్ నుంచి అచ్చంపేట సెంటర్‌నుంచి రాక్ సిరామిక్ వరకు 12.25 కిలోమీటర్ల నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం, బ్రిడ్జిలు, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, పీయూవోలు నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ రైల్వే వికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్ఎల్) సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టింది. గోకుల్ గార్డెన్‌నుంచి లైట్‌హౌస్ మీదుగా కాకినాడ యాంకరేజిపోర్టుకు ఆర్‌కే ఇన్‌ఫ్రా కంపెనీ 10 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నారు. ఈ రెండు ప్యాకేజీలకు రూ.540 కోట్ల నిధులు వెచ్చిస్తున్నారు.

ఏడీబీ రోడ్డు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ ఇలా..

అచ్చంపేట సెంటర్ గోకుల్ గార్డెన్ నుంచి సామర్లకోట రోడ్డు ముత్యాలమ్మతల్లి ఆలయంవద్ద వరకు రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి, పీయూవో బ్రిడ్జిల నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఏడీబీ రోడ్డులో సామర్లకోట రాక్ సిరామిక్ నుంచి సామర్లకోట బైపాస్ రహదారి కెనాల్ రోడ్డు మీదుగా భీమేశ్వరస్వామి ఆలయం నుంచి ముత్యాలమ్మ గుడి వరకు నాలుగులైన్ల రహదారి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పీవోయూ బ్రిడ్జి నిర్మాణం సాగుతోంది. సామర్లకోట రాక్ సిరామిక్ నుంచి ద్వారపూడి కెనాల్ రోడ్డు వరకు 3.6 కిలోమీటర్లు మేర రెండు లైన్ల, ముత్యాలమ్మ గుడినుంచి రైల్వేట్రాక్ మీదుగా కిలోమీటర్ మేర ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్యాకేజీ-2 కింద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు అచ్చంపేట సెంటర్ నుంచి యాంకరేజీ పోర్టు వరకు 10 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రహదారి పనులు సాగుతున్నాయి. ఈప్రాంతంలో 70శాతం మేర నిర్మాణ పనులు పూర్తయినట్లు ఎన్‌హెచ్ అథారిటీ అధికారులకు కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. అచ్చంపేట సెంటర్ నుంచి రాక్‌సిరామిక్ వరకు 50శాతం పైగా నిర్మాణ పనులు పూర్తయినట్లు ఆర్‌వీఎన్ఎల్ సంస్థ మేనేజర్ తెలిపారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

- శాప్ చైర్మన్ రవినాయుడు
- 'నన్నయ'లో క్రీడా నిర్మాణాల పరిశీలన


సమావేశంలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు, చిత్రంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): భారత జాతీయ పతాకాన్ని, ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని ప్రపంచ దేశాల్లో చాటి చెప్పాలనే ఉద్దేశంతో లోటుబడ్జెట్‌లో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర క్రీడాసాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఖేలో ఇండియా నిధులతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పనులను ఆయన, స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో కలసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖా మంత్రి ఆదేశాల మేరకు పాఠశాలల్లో క్రీడామైదానం ఖచ్చితంగా ఉండాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో జరగాల్సిన పనులు అనుకున్న సమయానికి జరగలేదని, కాంట్రాక్టర్ ఉదాసీనంగా వ్యవహరిస్తూ పనులు జాప్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి క్రీడాకారుల భవిష్యత్ ఎంతో ముఖ్యమైనదని దానికి తగినట్టుగా జవాబుదారీతనంతో వ్యవహరిస్తున్నామని చెప్పారు. గతంలో విశ్వవిద్యాలయంపై ఎన్నో అభియోగాలు వచ్చినప్పటికీ ప్రస్తుత వీసీ శ్రీనివాసరావు నాయకత్వంలో వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్నారు. పనుల నిర్మాణాలను పరిశీలించామని ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు ఇండోర్‌స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పనులు పూర్తి కావాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో జాతీయ క్రీడలు నిర్వహించే స్థాయికి ఇక్కడ వసతులు సమకూర్చాలని ఆదేశించారు. తాము ఆదేశించిన సమయానికి పనులు పూర్తికాకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని రవినాయుడు తెలిపారు. గతంలో 2016లో చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన క్రీడా వికాస కేంద్రాలను కనుమరుగు చేశారని ఆరోపించారు. వాటిపై దృష్టి సారిస్తామన్నారు. జాతీయ క్రీడలకు రాష్ట్రంలోని క్రీడాకారులంతా సంసిద్ధంగా ఉండాలని కోరారు. అందుకు శాప్ పూర్తి సహాయసహకారాలు అందిస్తామని శాప్ చైర్మన్ చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు వచ్చాయని వాటిని పరిశీలించి ఆమోదించేందుకు ప్రయత్నిస్తామన్నారు. పాఠశాలల నుంచి క్రీడలను ప్రోత్సహించేందుకు కార్యాచరణలు రూపొందిస్తున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయంలో క్రీడావసరాలు ఇంకా పటిష్టంగా ఉండాలన్నారు. దీనికి భిన్నంగా గత ప్రభుత్వ వైఖరి కారణంగా విశ్వవిద్యాలయాల్లో క్రీడావసతులు లేకుండా పోయాయన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఖేలో నిధులతో నిర్మిస్తున్న పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో సీఎం, హెచ్‌ఆర్‌డీ మంత్రుల దృష్టిలో ఉన్న అంశాన్ని పరిశీలించేందుకు శాప్ చైర్మన్ వచ్చి ఇక్కడ పనులు పరిశీలించారన్నారు. విజయవాడలో 50 మీటర్ల స్విమ్మింగ్ పూల్ నన్నయ విశ్వవిద్యాలయంలో రావడం ఆనందకరమని చెప్పారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు ప్రతిరోజూ మోనటరింగ్ చేయాలని సూచించారు. శాప్ చైర్మన్ ఆదేశించిన తేదీలోపు నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తిచేయాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. వీసీ ఆచార్య శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల విశ్వవిద్యాలయంలో రాజకీయపరమైన ఒత్తిళ్లు లేకుండా చక్కని పరిపాలన అందించేందుకు అవకాశం దక్కిందన్నారు. శాప్ చైర్మన్ ఆదేశించిన తేదీలోపు నిర్మాణాలు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్.లింగారెడ్డి, విశ్వవిద్యాలయం ఇంజనీర్ కె.నూకరత్నం, విద్యాకళాశాల చైర్మన్ కె.సుబ్బారావు, శాప్ అధికార్లు, ఇంజనీర్లు, నాయకులు, పీడీలు పాల్గొన్నారు.

మురిపించిన మంచు సోయగం



మోతుగూడెం, డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న చదలవాడ పంచాయతీ తులసిపాక వ్యూ పాయింట్ వద్ద మంచు అందాలు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడి వాతావరణాన్ని ఆస్వాదించేందుకు దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు.కనిష్ట ఉష్ణోగ్రతల నమోదువుతూ ఉండటంతో వృద్దులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు



ధర్మవరంలో ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ప్రత్తిపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో ఆదివారం ఎలక్ట్రికల్ బైక్ దగ్ధమైంది. గ్రామంలోని బ్యాంక్ సమీపంలో గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి దేవరపల్లి సత్యనారాయణ బైక్‌కు ఒక్కసారిగా పొగలు వ్యాపించాయి. దీంతో బ్యాంకు సమీపంలో దానిని నిలిపి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. పొగలు కమ్మిన బైక్‌ను ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పారు. రూ.1.20లక్షలతో కొనుగోలు చేసిన ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం కావడంపట్ల బైక్ యజమాని కంపెనీకి సమాచారం అందించారు.

అక్రమంగా తరలిస్తున్న 32 పశువులు స్వాధీనం

గొల్లప్రోలురూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి వద్ద జాతీయరహదారిపై ఆదివారం తెల్లవారుజామున వ్యాన్‌లో పశువులు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. విశాఖ నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న వ్యాన్‌లో ఉన్న 32 పశువులను స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు.

క్రీడలతో అంతర్జాతీయ ఖ్యాతి

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు
- క్రీడలపట్ల సీఆర్సీ చూపుతున్న ఆశక్తి అభినందనీయం
- 13 జిల్లాల నుంచి 26 జట్ల క్రీడాకారుల రాక

రావులపాలెం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు వారు రాణించే క్రీడల్లో చూపించే ప్రతిభాపాటవాలతో అంతర్జాతీయ ఖ్యాతి లభిస్తుందని రాష్ట్ర రవాణా, క్రీడాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆంధ్రా కబడ్డీ అసోషియేషన్ రావులపాలెం సీఆర్సీ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్సీ ఆవరణలో 50వ రాష్ట్రస్థాయి బాలుర, బాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే బండారు సత్యానందరావులు పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి, కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్ రెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజల్వన చేసి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడాకారుల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడలకు పెద్దపీట వేశారన్నారు. క్రీడాకారుల ఉద్యోగాల అవకాశాలలో 2 శాతం ఉన్న రిజర్వేషన్లు 3 శాతం పెంచి క్రీడాకారుల పట్ల మక్కువను చాటుకున్నారన్నారు. భవిష్యత్ రాష్ట్రంలో ఉన్న క్రీడాకారులను నేషనల్, ఇంటర్నేషనల్‌స్థాయికి ప్రోత్సహించేందుకు అన్ని విధాలా కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ప్రభుత్వమే కాకుండా రావులపాలెం సీఆర్సీ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సొంత ఖర్చులతో క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ క్రీడాకారుల వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. గ్రామీణస్థాయి క్రీడాకారులకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు వచ్చే విధంగా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఆర్సీ చేస్తున్న కృషి, సేవ అభినందనీయమన్నారు. అనంతరం మంత్రి ప్రజాప్రతినిధులతో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకుని మ్యాచ్‌ను ప్రారంభించారు. ఉమ్మడి 13 జిల్లాల నుండి 26 జట్ల క్రీడాకారులను కబడ్డీ పోటీల్లో తలబడేందుకు సిద్ధమయ్యారు. 13 బాలురు విభాగం కాగా, 13 బాలికల విభాగం. అనంతరం పలు జట్లు మ్యాచ్‌ను ప్రారంభించి పోటీల్లో తలబడ్డారు. ఇక్కడ జరిగే బాలుర, బాలికల విభాగంలో లీగ్ అండ్ నాకౌట్ పద్ధతిలో జట్లు తలపడతాయన్నారు. ఈరోజు జరిగిన మూడు మ్యాచ్‌ల్లో ఈస్ట్‌గోదావరి-విశాఖపట్నం తలపడగా ఆరు పాయింట్లతో ఈస్ట్‌గోదావరి గెలిచింది. ప్రకాశం-విజయనగరం తలపడగా 22పాయింట్లతో విజయనగరం గెలిచింది. శ్రీకాకుళం-కర్నూలు తలపడగా 19 పాయింట్లతో శ్రీకాకుళం విజయం సాధించింది. కార్యక్రమంలో స్పోర్ట్స్ డైరెక్టర్ వీరరాఘవరెడ్డి, చిన్నం తేజారెడ్డి, నందం వీరవెంకట సత్యనారాయణ, గుత్తుల పట్టాభిరామారావు, కంఠంశెట్టి శ్రీనివాస్, సత్తి రామకృష్ణారెడ్డి, సూర్య తదితరలు పాల్గొన్నారు.


రావులపాలెం సీఆర్సీలో జ్యోతిప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

సముద్ర జలాల్లో

మత్స్య జాతుల వృద్ధికి కార్యాచరణ

- మత్స్యశాఖ కమిషనర్ డోలాశంకర్ వెల్లడి

కాకినాడ సిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సముద్ర జలాల్లో మత్స్యజాతుల వృద్ధికి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ టి.డోలాశంకర్ వెల్లడించారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా ఆదివారం కాకినాడ సమీపంలోని హోప్ ఐలాండ్, పరిసర ప్రాంతాలను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, మత్స్యశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హోప్ ఐలాండ్ పరిసర ప్రాంత సముద్ర జలాల్లో సముద్రపు నాచు మొక్కల పెంపకం, తీరం వెంబడి సముద్ర కేజ్‌కల్చర్ యూనిట్స్‌లో అనుగుణమైన మత్స్యజాతుల పెంపకానికి అనుకూలమైన స్థలాలను పరిశీలించారు. అనంతరం మత్స్యశాఖ కమిషనర్ డోలాశంకర్ మీడియాతో మాట్లాడుతూ సముద్ర జలాల్లో రాఫ్ట్ కల్చర్ పద్ధతి లో సముద్రపు నాచు మొక్కలు పెంచుతామన్నారు. తీరం వెంబడి స్థలాల్లో సముద్ర కేజ్ కల్చర్ యూనిట్స్‌లో మత్స్యజాతుల పెంపకం చేపడతామన్నారు. త్వరలో దీనిపై సమగ్ర నివేదికను ప్రతిపాదనల రూపంలో తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పంతాడి రాజు, కాకినాడ బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంగాడి నాగేశ్వరరావు, ఫిషరీస్ మెరైన్ జేడీ పి.సురేష్, ఆక్వా జేడీ ఎండీ లాల్ మహమ్మద్, ఎస్ఐఎఫ్‌టీ ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ టి.సుమలత, జిల్లా మత్స్యశాఖ అధికారి కె.కరుణాకర్, ఫిషరీస్ ఏడీ, ఎస్ఐఎఫ్‌టీ ఎడీవో హోప్ ఐలాండ్‌ను సందర్శించారు.


హోప్ ఐలాండ్, పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ కమిషనర్ డోలాశంకర్, ఎమ్మెల్యే కొండబాబు


పాపికొండలుకు వెళుతున్న పర్యాటక బోట్లు

పాపికొండలుకు తొమ్మిది బోట్లు

- విహారయాత్రకు పర్యాటకుల సందడి

దేవీపట్నం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పాపికొండలు విహారయాత్రకు రాష్ట్రాల నలుమూలల నుంచి పర్యాటకులు పోటెత్తారు. తొలుతగా మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది బోట్లలో సుమారు 600మంది పర్యాటకులు మండల పరిధిలో ఉన్న పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి గోదావరి పరీవాహక ముంపు ప్రాంతాలైన పూడిపల్లి, తొయ్యేరు, దేవీపట్నం, అగ్రహారం, మూలపాడు, మంటూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పాపికొండలు నుంచి పేరంటాలపల్లి వెళ్లి సందడి చేశారు. అనంతరం తిరిగి సాయంత్రం 5గంటలకు పోశమ్మగండి చేరుకున్నారు.

పేరంటాలపల్లి వెళ్లిన 16 బోట్లు

వరరామచంద్రాపురం: పాపికొండలు, పేరంటాలపల్లి విహారయాత్ర ప్రకృతి అందాలను తిలకించేందుకు ఆదివారం 16 బోట్లు వెళ్లాయి. శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో పర్యాటకులు దాదాపుగా 1200 వందల మందికి పైగానే విహారయాత్రకు పర్యాటకులు రావడంతో పోచవరం పెర్రి పాయింట్ దగ్గర, పేరంటాలపల్లి మునిమఠం (శివాలయం) ప్రదేశాలలో పర్యాటకులతో సందడి వాతావరణం ఏర్పడింది. దీంతో ఆ ప్రాంతాలలోని కొండరెడ్ల వెదురుతో తయారుచేసిన అల్లికలను పర్యాటకులను ఆకర్షించడంతో వారి వద్ద నుంచి కొనడంతో ఆప్రాంత కొండరెడ్లకు కొంతవరకు ఉపాధి చేకూరుతుంది.

డాక్టర్ శ్రీనివాస్ సంపాదకీయాలు, రచనలు..

సమాజాన్ని చైతన్యం చేశాయి

- సీనియర్ సంపాదకులు డాక్టర్ శ్రీనివాస్‌తో గెట్‌టుగెదర్‌లో వక్తలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్.. (ఇన్‌సెట్‌లో) శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీనియర్ సంపాదకులు డాక్టర్ శ్రీనివాస్ సంపాదకీయాలు, రచనలు సమాజాన్ని చైతన్యం చేశాయని పలువురు వక్తలు అన్నారు. తూర్పుగోదావరిజిల్లాలోని రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డు ఏకేసీ రోటరీ రివర్ సిటీ హాలులో ఆదివారం డాక్టర్ శ్రీనివాస్‌తో ఏపీయూడబ్ల్యూజే, ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో 'సమయం.. సందర్భం' పేరిట గెట్ టు గెదర్ కార్యక్రమం సీనియర్ పాత్రికేయులు వీఎస్ఎస్ కృష్ణకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మండెల శ్రీరామ్మూర్తి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి ఆహూతులను వేదికపైకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి,మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు,మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, సీసీసీ ఎండీ పంతం కొండలరావు, ప్రముఖ మానసిక వైద్యులు కర్రి రామారెడ్డి, గుడా మాజీ చైర్మన్ గన్నికృష్ణ, రచయితలు అద్దేపల్లి ప్రభు, మారిశెట్టి జితేంద్ర, ముక్కామల చక్రధర్, టీడీపీ నేత యర్రా వేణుగోపాలరాయుడు, దేశిరెడ్డి బలరామనాయుడు, చాంబర్ పూర్వపు అధ్యక్షుడు అశోక్‌కుమార్ జైన్, సాహితీవేత్త యర్రాప్రగడ రామకృష్ణ, అయ్యలగోపి, సన్నిధానంశాస్త్రి, రాకా కార్యదర్శి జీవీ రమణ, ఆంధ్రజ్యోతి బీఎం ఎస్.శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ సంపాదకులు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మీడియా విస్తృతి, విలేకరులు, సోషల్‌మీడియా పెరగడం వంటి పరిణామాలు ప్రజాస్వామ్యానికి మంచిదేనన్నారు. జర్నలిజంలోకి కొత్తగా వస్తున్నవారిలో చాలా ధైర్యంగా రాసేవాళ్లు ఉన్నారన్నారు. రాజమహేంద్రవరంతోను, గోదావరితోను, వీరేశలింగం పంతుల తోటతోను తనకున్న అనుబంధాలను గుర్తుచేసుకున్నారు. తొలుత రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి పత్రిక నిబద్ధతతో తన పంథాను కొనసాగిస్తోందని, సాహిత్యానికి కూడా పెద్దపీట వేస్తోందన్నారు. సంపాదకులుగా పనిచేసిన డాక్టర్ శ్రీనివాస్ తన ప్రస్థానం కొనసాగించాలన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఐడియాలజీ, ఫిలాసఫీతో నడిపే పత్రికల్లో ఆంధ్రజ్యోతి ఒకటని, అటువంటి పత్రికలో సిద్ధాంత బద్ధంగా పనిచేస్తూ ప్రభుత్వాలను నిలదీసే సంపాదకీయాలు రాసిన డాక్టర్ శ్రీనివాస్ విలువలకు పెద్దపీట వేశారని కొనియాడారు. ఉభయ గోదావరి జిల్లాల పాత్రికేయులు కలిసి ఆంధ్రజ్యోతి పక్షాన డాక్టర్ శ్రీనివాస్‌ను గజమాలతో, శాలువాలతో సత్కరించారు. ఏపీయూడబ్ల్యూజే, ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ పక్షాన జ్ఞాపికలను శ్రీరామ్మూర్తి, కుడుపూడి పార్థసారథి అందించారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు


స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో భక్తులు

అన్నవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి ఆదివారం సెలవుదినం కావడంతో అశేష భక్తజనంతో పోటెత్తింది. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండుగంటలు, ఉచిత దర్శనానికి మూడుగంటల సమయం భక్తులు క్యూలైన్‌లో వేచియుండాల్సి వచ్చింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఏఈవో కొండలరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఒక్కరోజు వివిధ విభాగాల ద్వారా సుమారు 40 లక్షల ఆదాయం లభించింది.

ఘనంగా సత్యదేవుడి రథసేవ :

సత్యదేవుడికి వారాంతపు అర్జిత సేవయిన రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రదానాలయం నుండి తోడ్కొనివచ్చి టేకురథంపై ఆశీనులు గావించి అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రదానాలయానికి తీసుకెళ్లారు.

'లోవ' ఆదాయం రూ.2.48 లక్షలు

తునిరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. తలుపులమ్మ అమ్మవారిని అర్చకస్వాములు సర్వాంగసుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలోని వసతిగదులు, ఆరు బయట వంట షెడ్లలో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. వివిధ విభాగాల ద్వారా రూ.2.48 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాథరాజు తెలిపారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

మళ్లీ కాలువలోకి కారు

- ప్రాణాలతో బయటపడిన వాహనదారుడు
- ప్రమాదాన్ని చూస్తూ..రెండు ద్విచక్రవాహనాలు ఢీ
- పది రోజుల వ్యవధిలో ఇది రెండో ప్రమాదం
- భయాందోళనలకు గురవుతున్న స్థానికులు


కాలువలోకి దూసుకుపోయిన కారును తీస్తున్న దృశ్యం

పి.గన్నవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతావారిపేటవద్ద పదిరోజులక్రితం జరిగిన ప్రమాదంలో ఒక మహిళ, ఇద్దరు చిన్నారులు చనిపోయారు. ఈసంఘటన మరువక ముందే మళ్లీ కారు పంట కాలువలోకి దూసుకుపోయింది. ఈ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రయాణం చేయాలంటే స్థానికులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు, నాయకులు ఇటువంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రావులపాలెం వైపు నుంచి వస్తున్న కారు ప్రమాదవశాత్తూ అదుపుతప్పి ప్రధాన పంట కాల్వలోకి దూసుకుపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా అల్లవరం మండలం దేవగుప్తంనకు చెందిన పోసిన పెద్ది సాయిధీరజ్ రావులపాలెం నుంచి తమ బంధువులు ఇంటికి రాజోలు మండలం కడలి గ్రామానికి కారులో బయలుదేరాడు. ఈక్రమంలో రాజవరం-పొదలాడ రోడ్డులో ఉడిమూడి శివారు చింతావారిపేట వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తూ కారు ప్రధా న పంటకాల్వలోకి దూసుకుపోయింది. దీంతో చాకచక్యంగా వ్యహరించి వెనుక భాగంలో ఉన్న డిక్కీని ఒపెన్ చేసి బయటపడటంతో స్థానికులు ఒడ్డుకు చేర్చారు. అదే సమయంలో ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తూ....అటుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడిని వెనుక వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు బలంగా ఢీకొట్టాడు. ఈఘటనలో వెనుకవస్తున్న వాహనదారుడు (పశ్చిమగోదావరిజిల్లా కైకరంనకు చెందిన)కి బలమైన గాయంకావడంతో 108సాయంతో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్వల్పగాయాలతో బయటపడిన సాయిధీరజ్ స్థానికులు సాయంతో కారును బయటకు తీశారు.

పదిరోజుల వ్యవధిలో.. రెండో ప్రమాదం

ఒక ప్రమాదం జరిగి పదిరోజులు పూర్తి కాకుండానే కూతవేటు దూరంలో అదేమాదిరిగా మరో ప్రమాదం జరగటంతో స్థానిక ప్రజానీకంతో పాటు వాహనదారులు సైతం తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. ఈనెల 10వతేదీ తెల్లవారుజామున జరిగిన ఘోర కారు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ఇద్దరు కుమారులు మృతి చెందిన సంగతి పాఠకులకు విదితమే. ఆ సంఘటనను మరువక ముందే మరో ఘటన అదే ప్రాంతంలో చోటుచేసుకుంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రాజవరం-పొదలాడ రోడ్డులో పొదలాడ నుంచి గంటి వరకు కాలువ వైపు రక్షణగా ఇనుప రైలింగ్‌ను ఏర్పాటుచేసి ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సర్వే కోసం రూ.550 చెల్లించాలా!



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

తప్పు మీరు చేసి రైతులపై భారమా
అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు
రీ సర్వే తప్పిదాలపై గ్రామసభలు ఇందుకేనా
వాడివేడిగా గొల్లప్రోలు మండల సమావేశం

గొల్లప్రోలురూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేలో తప్పులు అధికంగా వచ్చాయి. వాటిపై గ్రామసభలు నిర్వహించి వాటి అన్నింటినీ సరిచేస్తామని ప్రభుత్వం చెబుతుంటే సర్వేకోసం ఏకంగా ఒక్కొక్క రైతు రూ.550లు చెల్లించాలనడం ఏమిటని ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. రీ సర్వే పేరుతో తప్పులు అధికారులు చేసిన తప్పులకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఉచితమని చెబుతుంటే మీరు ఎందుకు సొమ్ములు వసూలు చేస్తున్నారంటూ నిలదీశారు.

గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. సమావేశంలో రీ సర్వేలో వచ్చిన తప్పులపై నిర్వహించిన రీ సర్వే గ్రామసభలు, ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ సదస్సుల అంశం చర్చకు వచ్చింది. గ్రామసభల్లో విస్తీర్ణాలు తక్కువ వచ్చాయని, ఇతర వివరాలు తప్పుడుగా నమోదయ్యాయని దరఖాస్తు చేసుకున్న రైతులను సర్వే కోసం రూ.550 చెల్లించడంతో పాటు చుట్టుపక్కల రైతుల కన్సెంట్ తీసుకురావాలని చెబుతున్నారని గొల్లప్రోలు జడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల నాగలోవరాజు సహా పలువురు ప్రజాప్రతినిధులు తెలిపారు. రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలోకి రాకుండా నిర్వహించిన సర్వేవలన రీసర్వే 75శాతం తప్పులతడకగా మారిందని ఆరోపించారు. ప్రభుత్వం అన్నింటినీ ఉచితంగా సరిచేస్తామని చెబుతుంటూ ఇక్కడ డబ్బులు ఎందుకు కట్టమంటున్నారని ప్రశ్నించారు. అధికారులు చేసిన తప్పులకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, 50 శాతంపైగా రైతులకు పంట నష్టపరిహారం అందలేదని తెలిపారు. ఇటువంటప్పుడు ఆర్భాటంగా గ్రామసభలు, రెవెన్యూ సదస్సులు నిర్వహించడం ఎందుకని నిలదీశారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని తహసీల్దారు సత్యనారాయణ తెలిపారు.

అనర్హులకు గోకులాలు

గోకులాలు(పశువుల షెడ్లు)కు లబ్ధిదారుల ఎంపికలో అనర్హులకు అన్యాయం జరిగిందని, 10 ఎకరాలకు పైగా ఉన్న రైతులను ఎంపిక చేశారని జడ్పీటీసీ నాగలోవరాజు, వన్నెపూడి ఎంపీటీసీ కందా పేర్రాజు, కొడవలి సర్పంచ్ బుర్రా శ్రీరామచంద్రలు తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక జాబితాను రద్దు చేయాలని కోరుతూ తీర్మానం చేయాలని మెజార్టీ ప్రజాప్రతినిధులు కోరారు. దీనితో ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలపై తనిఖీచేసి అనర్హులను తొలగిస్తామని ఎంపీడీవో కర్రి స్వప్న తెలిపారు. సమావేశానికి ముందు గొల్లప్రోలు ఎంపీడీవోగా పని చేసిన హరిప్రియ ఆకస్మిక మృతికి ప్రజాప్రతినిధులు, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రైతులు, నిరుద్యోగులకు న్యాయం చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పెద్దాపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధి, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు వచ్చే విధంగా పరిశ్రమలు తీసుకురావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కొప్పుల వెలమ సంక్షేమ భవనంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఆదివారం మాట్లాడారు. నాలుగు నెలల క్రితం మన్యంలో డోలీ మోతలపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారని, డోలీ మోతలు నిత్యకృత్యమయ్యాయన్నారు. నేటికీ మన్యంలో డోలీ మోతలు కొనసాగుతున్నాయన్నారు. కార్పొరేట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఊడిగం చేస్తున్నా యని, అదానీ కోసం విజయనగరం నుంచి రాజమహేంద్రవరం వరకూ ఆరు లేన్ల రహదారిని నిర్మిస్తున్నారన్నారు. సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే యోచనలో ఉన్నారని, కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. కాకినాడ సెజ్‌లో సుమారు 650 ఎకరాల ప్రభుత్వ భూమి నేటికీ ఖాళీగా ఉందని, వాటిలో పరిశ్రమలు పెట్టవచ్చని అటువంటి చర్యలు ప్రభుత్వం ఎందుకు చేపట్టడంలేదని ప్రశ్నించారు. అన్నవరంవద్ద విమానాశ్రయ నిర్మాణం కోసం రైతుల నుంచి భూములను లాక్కునే ప్రయత్నం ఆపాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, మండల కన్వీనర్ దారపురెడ్డి క్రాంతికుమార్, నీలపాల సూరిబాబు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిని కలిసిన దూసర్లపూడి

పెద్దాపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావును పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, సామాజిక కార్యకర్త దూసర్లపూడి రమణరాజు పెద్దాపురంలో ఆదివారం కలిశారు. కాకినాడ జిల్లా కేంద్రాన్ని గ్రేటర్ సిటీగా ప్రభుత్వం ప్రకటించే చర్యలకు రాష్ట్ర సీపీఎం పార్టీ ప్రజాహిత తీర్మానం ద్వారా ప్రభుత్వానికి లేఖ రాయాలని ఆయన కోరారు. వినతి పత్రాన్ని కూడా అందజేశారు.

24 నుంచి కాకినాడలో 'హోమ్ ఎక్స్‌పో' ప్రదర్శన

కాకినాడ సిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 24 నుంచి 26 వరకు మూడురోజులపాటు కాకినాడ ఎస్ఆర్ఎంటీ ఫంక్షన్ హాల్‌లో భవన నిర్మాణ రంగానికి సంబంధించి 6వ 'హోమ్ ఎక్స్‌పో' ప్రదర్శన నిర్వహిస్తున్నామని క్రెడయ్ కాకినాడశాఖ అధ్యక్షుడు విజయకృష్ణ అన్నారు. క్రెడయ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ప్రదర్శన ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు విజయకృష్ణ మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో 72 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఏపీఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా శరత్‌చంద్ర





పి. శరత్‌చంద్ర (ఫైల్), ఎం.రాఘవులు (ఫైల్)

సర్పవరం జంక్షన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిగా పి శరత్‌చంద్ర, ఎం. రాఘవులను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కా వెంకటేశ్వరరావు ప్రకటించారు. ఆదివారం రమణయ్యపేటలో జరిగిన ఏపీఎస్టీఏ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావుల ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగిందన్నారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు శరత్‌చంద్ర, ప్రధాన కార్యదర్శి రాఘవులు మాట్లాడుతూ బడి, బాధ్యత, భవిష్యత్తు నినాదంతో పని చేస్తామని, ప్రభుత్వ బడుల పరిరక్షణ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు.

జేవీవీ జిల్లాస్థాయి పోటీలలో సామర్లకోట విద్యార్థి ప్రతిభ

సామర్లకోట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన జాతీయ గణిత పోటీల్లో సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని వి.చాందిని మోనో యాక్షన్ కేటగిరి పోటీల్లో ప్రతిభకనబర్చి ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నట్లు పాఠశాల హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్విజ్‌పోటీల్లో పాఠశాలకు చెందిన హరిణి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. వీరికి జేవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, రామారావులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను ఆదివారం వేళంగి పాఠశాలలో జరిగిన వేడుకల్లో అందజేశారు. పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయిలో బహుమతులు సాధించేందుకు ప్రోత్సహించిన ఉపాధ్యాయులను హెచ్ఎం సాయిరామకృష్ణ అభినందించారు.

పీవీ రావ్‌కి ఘన నివాళి

తాళ్లరేవు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వర్గీయ మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీరావు వర్ధంతిని మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ భవనంవద్ద పి.వి.రావు విగ్రహానికి దళితనేతలు దున్నా సుబ్రహ్మణ్యం, జక్కల ప్రసాద్‌లు ఘన నివాళులర్పించారు. సర్పంచ్ నూకరాజు, దున్నా మురళీకృష్ణ, గోడి భాస్కరరావు, నాగేంద్రరావు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యుడు సతీష్‌కు ఘన స్వాగతం



రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కాకినాడసిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారంచేసి తొలిసారిగా కాకినాడ జిల్లాకు విచ్చేసిన సానా సతీష్ బాబుకు ఆదివారం కాకినాడ జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు మేకా లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ ప్రాంతం నుంచి పార్టీశ్రేణులు ఘన స్వాగతం పలికారు. మధురపూడి నుంచి ర్యాలీగా కాకినాడ వరకు వెంట వచ్చారు. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తాటికాయల వీరబాబు, తెలుగుదేశం నాయకులు బొళ్ల కృష్ణమోహన్, కాకతీయ అసోసియేషన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సతీష్‌బాబుకు తెలుగు మహిళల స్వాగతం

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబుకు కాకినాడ మెయిన్‌రోడ్ సూపర్‌బజార్ వద్ద 36వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారంరాత్రి తెలుగు మహిళలు పసుపురంగు చీరలుధరించి స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని సతీష్‌బాబుకు మంగళ హారతులిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ మహిళా నాయకురాలు నల్లూరి తులసి, ఆకెళ్ల ప్రసాద్, ఉప్పులూరి వీరభద్రరావు, సరగడ గృహలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకినాడ నగరమంతా పసుపు మయం

రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా కాకినాడ విచ్చేసిన సానా సతీస్‌బాబుకు ఆదివారం రాత్రి టీడీపీ శ్రేణులు, అభిమానులు అఖండ స్వాగతం పలికారు. భానుగుడి సెంటర్ వద్ద కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు శాలువా కప్పి గజమాలతో సతీష్‌బాబుకు స్వాగతం పలికారు. అక్కడ సతీష్‌బాబు వాహనంలోకి ఎక్కి ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, టీడీపీ నగర అధ్యక్ష కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, సిటీ మాజీ అధ్యక్షుడు సుంకర తిరుమలకుమార్ ర్యాలీలో కొనసాగారు. ఈ సెంటర్ వద్ద టీడీపీ నాయకుడు వనమాడి ఉమాశంకర్ కార్యకర్తలతో కలిసి సతీష్‌బాబుకు స్వాగతం పలికారు. అనంతరం టూటౌన్ సెంటర్, సూపర్ బజార్ సెంటర్, మసీదు సెంటర్, తిలక్‌వీధి సెంటర్‌ల వద్ద పార్టీశ్రేణులు ర్యాలీని నిలిపివేసి సతీష్‌బాబును పూలదండలతో ముంచెత్తారు. అక్కడినుంచి జగన్నాథపురం బ్రిడ్జి, సినిమారోడ్, కల్పన సెంటర్ మీదుగా కోకిల సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. కల్పన సెంటర్ వద్ద కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, మహిళా కార్యకర్తలు స్వాగతం పలికారు.

భారీ మోటార్‌సైకిల్ ర్యాలీతో స్వాగతం

పిఠాపురం: రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసి తొలిసారి పిఠాపురం నియోజకవర్గానికి వచ్చిన సానా సతీష్‌కు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో ఘనస్వాగతం లభించింది. కత్తిపూడి నుంచి గొల్లప్రోలు మీదుగా పిఠాపురం బైపాస్‌రోడ్డు వైజంక్షన్ వద్ద నుంచి పశువుల సంత, ఆర్టీసీ కాంప్లెక్సు, చర్చి సెంటర్, మెయిన్‌రోడ్డు, ఉప్పాడ సెంటర్, పాతబస్టాండు, తహసీల్దారు కార్యాలయం, పాదగయ జంక్షన్ మీదుగా ఓపెన్‌టాప్ జీపులో సతీష్ ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. పాదగయ వద్ద ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ సానా సతీష్‌కు స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సత్కరించి పురుహూతికాఅమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. సతీష్ వెంట రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ సుజయ కృష్ణరంగారావు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ ఉన్నారు.



పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద ఎంపీ సానా సతీష్‌బాబుకు పురుహూతికా అమ్మవారికి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో, చిత్రంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు: రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌కు చేబ్రోలు, గొల్లప్రోలుల్లో ఘనస్వాగతం లభించింది. ఆయా ప్రాంతాల్లో జనసేన, టీడీపీ నేతలు స్వాగతం పలికి పూలదండలు వేశారు. గొల్లప్రోలు బైపాస్ వైజంక్షన్ వద్ద భారీ గజమాలను క్రేన్ సహాయంతో వేశారు. భారీ కార్ల ర్యాలీతో సతీష్ ముందుకు సాగారు. ఆయన వెంట పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

సామర్లకోట: రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా సొంతపట్టణం అయిన కాకినాడకు భారీ కాన్వాయ్‌గా తరలివచ్చిన సానా సతీష్‌బాబుకు పెద్దాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎంపీని పూలమాలలతో ముంచెత్తి అభినందించి ఘన స్వాగతం పలికారు.

సర్పవరం జంక్షన్ : ఆదివారం సాయంత్రం అచ్చంపేట సెంటర్ వద్ద కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, ఉమ్మడి గోదావరి టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్(బాబీ), సర్పవరం జంక్షన్‌లో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు తదితర నాయకులు పార్టీశ్రేణులతో కలసి గజమాలలతో ఘనస్వాగతం పలికారు.



ఎంపీ సానాతో ర్యాలీలో పాల్గొన్న కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ కటకం శెట్టి బాబి

26 నుంచి వీరబాల దివస్ కార్యక్రమాలు

సామర్లకోట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సిక్కుల పదవ గురువు గురుగోవింద సింగ్ చిన్న కుమారులు సాహెబ్‌జాదేల ధైర్యసాహసాలను, త్యాగాలను స్మరిస్తూ ఈనెల26 నుంచి భారతీయ జనతా పార్టీ కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో వీర బాలదివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకులు, వీరబాలదివస్ అధికార ప్రతినిధి పెద్దిరెడ్ల రవికిరణ్ పేర్కొన్నారు. సామర్లకోట పట్టణంలోని బీజేపీ నాయకులు డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొర ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో వీరబాలదివస్ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను రవికిరణ్ స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం

పిఠాపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాటం చేద్దామని ఆంధ్రప్రదేశ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బల రాజు పిలుపునిచ్చారు. మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు 19వ వర్థంతి, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం పిఠాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ వల్ల జరిగే నష్టం గురించి ప్రజలకు వివరించి చైతన్య పరచాలని సూచించారు. పీవీరావు పోరాట స్ఫూర్తితో పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు అంబేడ్కర్, పీవీరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా వెంకట్రావు, ముంజవరపు కృపానందం, దాట్ల సూరిబాబు, బోయ నాగేశ్వరరావు, నేపాల వరలక్ష్మి, గుళ్ల కృష్ణ, వడ్డీ ప్రవీణ్ పాల్గొన్నారు.





పిఠాపురం సభలో మాట్లాడుతున్న గుబ్బల రాజు, కాకినాడ: పీవీ రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పీవీ రావు 19వ వర్ధంతి

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత పీవీరావు 19వ వర్ధంతి కార్యక్రమాన్ని కాకినాడ ఎస్.అచ్చుతాపురంలో ఆదివారం నిర్వహించారు. అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ పండు అశోక్‌కుమార్ పాల్గొని పీవీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, మూలే మేఘరాజు, లింగం శివప్రసాద్, బుంగా సతీష్ తదితరులు పాల్గొన్నారు.


బకాయిల పరిష్కారం కోసం పీఆర్‌సీ చైర్మన్‌ను నియమించండి

కాకినాడ సిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు రావాల్సిన బకాయిల పరిష్కారం కోసం పీఆర్‌సీ చైర్మన్‌ను నియమించాలని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహనరావు కోరారు. కాకినాడ ఎన్జీవో హోంలో ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రామ్మోహనరావు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసు విచ్చేశారు. ఈసందర్భంగా ఐఆర్ చెల్లింపులు, ఓపీఎస్ అమలు, హెల్త్ కార్డులు, పెండింగ్ డీఏ బకాయిలు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్‌పై చర్చించారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, కె.రాజబాబు, సంయుక్త కార్య దర్శి బి.శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి వై.పద్మ మీనాక్షి, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి, జిల్లా కన్వీనర్ దేవి, యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన తెలిపారు. కాకినాడ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఉదయం 9.30గంటల నుంచి డయల్ యువర్ కమిషనర్ తదుపరి 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



నూతన దుస్తులు అందించిన అడబాల

సర్పవరం జంక్షన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట కొత్తూరు క్రీస్తు సంఘం చర్చిలో మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ ఏసురత్నం ఏసు క్రీస్తును ప్రార్థిస్తూ ఉపదేశం అందించారు. కేక్ కట్‌చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. బి.సత్యనారాయణరాజు, శిరీష, ప్రసాద్ నాయుడు, సీహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి



పిఠాపురంలో మానవహారం నిర్మించి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్, ప్రజాసంఘాల నాయకులు

పిఠాపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన వాఖ్యలకు నిరసనగా పిఠాపురం పట్టణంలోని ఇందిరానగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్, దళిత, ప్రజాసంఘాల నాయకులు ఆదివారం మానవహారంగా ఏర్పడి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు(చిట్టిబాబు) మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అంబేడ్కర్‌ను అపర మేధావిగా కొనియాడుతుంటే పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానిస్తూ మాట్లాడటం అన్యాయమన్నారు. తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అందోళనలో దళిత బహుజన పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఆర్.నాగేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు మొల్లేటి సూర్యనారాయణ, ఎంజే పెట్రిక్, సాకా రామకృష్ణ, గంటా సత్యనారాయణ, వాసుపల్లి వాసు, భద్రరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వే పనులు పునఃప్రారంభం

సామర్లకోట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ వివాదాలు శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సామర్లకోట మండలంలో రీసర్వే పనులు పునఃప్రారంభిస్తున్నట్లు తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర రెడ్డి చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామాన్ని ఎంపిక చేయడంతో రీసర్వే పనులను ఆదివారం సాయంత్రం పునఃప్రారంభించారు. ఈసందర్భంగా తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు సంయుక్తంగా సోమవారం నుంచి రీసర్వే పనులు నిర్వహిస్తారన్నారు. వేట్లపాలెంలో గడికట్టు విస్తీర్ణం 4,873.30ఎకరాలు సర్వే చేసేందుకు 24 సర్వే బృందాలను ఎంపికచేశామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు సీతారామాచార్యులు వీఆర్వోలు మామిడాల కామరాజు, కె.వీ.వీ.సత్యనారాయణ, ఖాదర్ వలీ పాల్గొన్నారు.



వేట్లపాలెంలో రీసర్వే పనులకు భూమిపూజలు చేసిన తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి

నష్టపోయిన వారికి పరిహారం ఎప్పుడిస్తారు?



పరిహారం అందలేదని డీడీని ప్రశ్నిస్తున్న రైతులు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టుగూళ్ల నష్టపోయిన రైతుల్లో ఇంకా పలువురికి పరిహారం అందలేదని, వారికి నష్టపరిహారం ఎప్పుడు ఇస్తారో చెప్పాలని పలువురు పట్టు రైతులు డిమాండ్ చేశారు. చేబ్రోలులోని సెరీకల్చర్ ఫారమ్‌లో ఆదివారం రైతులతో పట్టు పరిశ్రమశాఖ డిప్యూటీ డైరెక్టర్ గీతారాణి సమావేశం నిర్వహించారు. రైతులకు అందాల్సిన ఇన్సెంటివ్ బకాయిలను తక్షణం అందించాలని రైతులు డిమాండ్ చేశారు. బకాయిల విడుదలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు తెలిపారు. సమావేశంలో పట్టుపరిశ్రమ అధికారి మోసయ్య పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

కాకినాడ రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం చీడిగలో రూ.34.50లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఎంపీపీ, గ్రామపంచాయతీ నిధులతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో త్రాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గ్రామాల్లోని విలేజ్ క్లినిక్‌లను ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవో బి.గోవిందరాజులు, సచివాలయ సిబ్బంది, జనసేన, టీడీపీ నాయకులు మహేష్, అప్పన్నశ్రీనివాసరావు,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు


పిఠాపురం, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని ఆలయాల్లో ధనుర్మాస పూజలు వైభవంగా జరుగుతున్నాయి. దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న కుంతీమాధవస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చనలు, గోదా అమ్మవారికి శ్రీ చూర్ణం అర్చనలు, ద్రవిడ ప్రబంధ పారాయణ(తిరుప్పావై), నీరాజనం, పాశుర విన్నపం జరిగాయి. సాయంత్రం గోదా అమ్మవారికి మాడవీధి సేవ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో నున్న శ్రీరాములు, కుంతీమాధవ భక్త బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. సహస్ర చామంతి పుష్పార్చన అనంతరం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. అర్చకుడు పి.విజయజనార్ధనాచార్యులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, ఈవో నున్న శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

జీవిత గమ్యాన్ని రూపొందించేది గణితమే

కాకినాడరూరల్, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరికీ జీవిత గమ్యాన్ని రూపొందించేది గణితమేనని జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ అన్నారు. ఎంఎస్ఎన్ చార్టీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఆదివారం కౌశల్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాస్ అధ్యక్షతన పాఠశాల విద్యాశాఖ, యంగ్‌మైండ్స్, విజ్ఞానభారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు గణిత రంగోలి, క్విజ్ అంశాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. యంగ్‌మైండ్స్ వ్యవస్థాపక అధ్యక్షులు వాకాడ వెంకటరమణ, బాలవేదిక జిల్లా కన్వీనర్ నోరి బలరామకృష్ణ పాల్గొన్నారు.

నాటక, కళా రంగాలకు 'దంటు' సేవలు ఎనలేనివి

ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ సభ్యుల నివాళి



కాకినాడ సిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నాటక, కళా రంగాలకు దంటు సూర్యారావు విశిష్ట సేవలు అందించారని ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ సభ్యులు కొనియాడారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు, దంటు కళాక్షేత్రం వ్యవస్థాపకుడు దంటు సూర్యారావు జయంతి సందర్భంగా స్థానికంగా గల కళాక్షేత్రం ప్రాంగణంలో ఆదివారం క్లబ్ సభ్యులు సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత సంస్థ ఉపాధ్యక్షులు సీతారామ్, ముంజులూరి విశ్వేశ్వరరావులు సూర్యారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం క్లబ్ కార్యదర్శులు పీవీ రావు, ప్రభుదాస్, కె.కృష్ణారావు, విశ్వేశ్వరరావు, బుర్రా పద్మనాభం మాట్లాడుతూ కళా రంగానికి సూర్యారావు చేసిన సేవలు అమోఘమన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఎస్‌కే అమీర్, పి.రామకృష్ణ, మార్ని జానికిరామచౌదరి, కాటంరెడ్డి, చంద్రశేఖర్, సురేంద్రరాజు, అయ్యగారి వెంకటేష్, ఎంవీ రమణ, తురగా సూర్యారావు, మహేష్ పాల్గొన్నారు.

వాసవీ మాతకు పూజలు

గొల్లప్రోలు, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ధనుర్మాసం సందర్భంగా వాసవీ అమ్మవారికి ఆదివారం పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు లలితా, విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. ఆర్యవైశ్య మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

29న భూపతిపాలెం గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం

జగ్గంపేట రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భూపతిపాలెం గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల కలయికను ఈ నెల 29న ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు కమ్మిల ఫణి, ఈబీ శ్రీనివాస్, సీహెచ్ఎస్ ఫణికుమార్ ఆదివారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిసి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



నిబంధనలు పాటించని వాహనచోదకులపై చర్యలు

ప్రత్తిపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని వాహనచోదకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ లక్ష్మీకాంతం హెచ్చరించారు. మండలంలోని ధర్మవరం కోల్డ్ స్టోరేజ్ వద్ద ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు, చిన్నకార్ల వాహనదారులు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే జరిమానా తప్పదన్నారు. మారిన ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మాజీ సర్పంచ్ భాస్కరబాబు గుండెపోటుతో మృతి



రౌతులపూడి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బలరామపురం మాజీ సర్పంచ్ సోమరౌతు భాస్కరబాబు (78) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈయన సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. భాస్కరబాబు కుటుంబ సభ్యులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, శంఖవరం ఎంపీపీ పర్వత రాజుబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పరామర్శించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



డొంకరాయి ప్రాంతంలో తడిసి ముద్దయిన మినప చేనును చూసి రోదిస్తున్న గిరిజన రైతు, డొంకరాయిలో కల్లంలో ధాన్యం కుప్పపై టార్పాలిన్ కప్పిన దృశ్యం

అకాల వర్షం... అన్నదాతకు నష్టం

మోతుగూడెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో మన్యంలో మూడు రోజులు గా ముసురు వాతావరణం చిరుజల్లుతో మోస్తరు వర్షం కురిసింది. వై.రామవరం మండలం డొంకరాయి పరిధిలోని గ్రామాల్లో వరి, మినుము, రాగి తదితర పంటలు దెబ్బతిన్నాయి. కల్లాల్లో మినులు, రాగి, వరి కుప్పలపై టార్పాలిన్లు కప్పి రక్షణ కల్పించారు. రెడ్డినగర్, బాబూనగర్, మెట్టగూడ, విల్లార్తి, బొడ్డుమామిడి, పాలగడ్డ, మంగంపాడు, నవగూడ, మిర్చిగూడ, తెలుగు క్యాంపు, బురదకోట, రాజు క్యాంపు, అపుదర, జండాకూపి, బొచ్చులూరు, నర్సాపూర్ గ్రామాల్లో మినుము, రాగి, వరి పంటలు తడిసి నేలపాలయ్యాయని అన్నదాతలు ఆవేదన చెందారు. తమను ఆదుకోవాలని కోరారు.



జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మండల కార్యదర్శి వెంకట్

'గ్రామ/వార్డు వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి'

చింతూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం చింతూరులో జరిగిన గ్రామ/వార్డు వలంటీర్ల జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. చింతూరు ఐటీడీఏ ఎదుగల ఈ నెల 26, 27, 28 తేదీల్లో రిలే దీక్షలు చేపట్టనున్నట్టు తెలిపారు. గిరిజన సంఘం జిల్లా నాయకుడు సీసం సురేష్, నాయకులు పొడియం జాని, కలుముల మహేష్‌కుమార్, సోడె దుర్గారావు, రాంరెడ్డి, పద్మావతి, శాంతి, రవి తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షా శిబిరంలో ఆదివాసీ నాయకులు

ఏడో రోజుకు ఆదివాసీల దీక్షలు

వై.రామవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుర్తేడు రోడ్డు నిర్మాణం కోసం ఆదివాసీ చైతన్య వేదిక సంఘం వై.రామవరంలో చేస్తున్న రిలే దీక్షలు ఆదివారం ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఈ రోడ్డు వల్ల సుమారు 60 గ్రామాల గిరిజనులకు రవాణా సదుపాయాలు, మౌలిక సదుపాయాలు కలుగుతాయని ఆదివాసీ నాయకులు తెలిపారు. ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు గుడ్ల త్రిమూర్తులు, పుడిగి లక్ష్మణరావు, బత్తుల శారద, బత్తుల యోగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి

రాజవొమ్మంగి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ గురుకుల పాఠశాలలో శ్రీనివాస్ రామానుజన్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.



ఇరుముడులు నెత్తిన పెట్టుకుని కాలినడకన ఇంద్రకీలాద్రి వెళ్తున్న భవాని దీక్షాపరులు

పాదయాత్రగా ఇంద్రకీలాద్రికి...

వరరామచంద్రాపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దుర్గమ్మ మాలాధారణ చేపట్టిన భవాని భక్తులు ఆదివారం ఇంద్రకీలాద్రి బయల్దేరారు. మండలంలో వందల సంఖ్యలో భక్తులు అమ్మవారి దీక్షను భక్తి శ్రద్ధలతో చేపట్టారు. 41 రోజులు కఠిన భవాని దీక్షను నియమనిష్టలతో భక్తిశ్రద్ధలతో ప్రతిరోజూ మూడుపూటలా స్నానం చేయాలి. ఉదయం, సాయంత్రం వీఆర్ పురంలోని అమ్మవారి ఆలయంలో ధూప, దీప నైవేద్యాలతో 41 రోజులు పూజలు జరిపి ఇరుముళ్లతో ఇంద్రకీలాద్రికి బయల్దేరారు.



గండిపోశమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

దేవీపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలాచరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. మొక్కులు చెల్లించుకుని సహపంక్తి భోజనాలు చేశారు.



గండేపల్లి మండలం మురారి శివార్లలో సతీష్‌కి స్వాగతం పలుకుతున్న జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడులో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యప్రభ

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌కి ఘన స్వాగతం

జగ్గంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసి తొలిసారిగా జిల్లాకు విచ్చేసిన సానా సతీష్‌కి జగ్గంపేట కృష్ణవేణి సెంటర్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ స్వాగతం పలికి పూలమాలలు వేసి బొకేలు అందజేశారు.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌కు మండలంలోని మురారి గ్రామ శివారున జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, రాష్ట్ర అటవీ కార్పొరేషన్ చైర్మన్ సుజయ కృష్ణరంగారావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మండల శాఖ అధ్యక్షుడు పోతుల మోహనరావు, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, సుంకవిల్లి రాజు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్ ప్రత్యేకంగా సానా సతీష్‌ను సన్మానించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత మురారిలో గుబ్బాలమ్మ ఆలయంలో సానా సతీష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శంఖవరం మండలం కత్తిపూడిలో గజమాలతో సత్కారం

రౌతులపూడి/శంఖవరం (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబుకు స్వాగతం పలికేందుకు రౌతులపూడి, శంఖవరం మండలాల్లోని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా కత్తిపూడి తరలివెళ్లారు. రౌతులపూడి నుంచి ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, ములగపూడి నుండి టీడీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ తమరాల సత్యనారాయణ, ఎంపీటీసీ యామల సురేష్, మల్లవరం నుంచి పల్లికుమార్, గుడివాడ గురునాథ్, ఎస్.పైడిపాల నుంచి ఈగల సత్తిబాబు, గొల్లు పెద్ద దివాణం, బంగారయ్యపేట నుంచి ఉండ్రాజు దివాణం, శృంగవరం నుంచి లొండా దేవుళ్లు, వాసం సాంబశివరావు వెళ్లారు.



పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

మల్లిశాలలో విద్యార్థుల అ'పూర్వ' కలయిక

జగ్గంపేట రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లిశాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-08 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం మరలా కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆహ్లాదంగా గడిపారు. 16 సంవత్సరాల ఒకేచోటకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మల్లిశాల జిల్లా పరిషత్ హై స్కూల్లో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. అలనాటి ట్యూషన్ మాస్టార్ని ఘనంగా సత్కరించారు. తోటి స్నేహితులతో కలిసి మధురస్మృతులు గుర్తు చేసుకుంటూ ఆనాటి కలలను మరోసారి తమ స్నేహితుల వద్ద ప్రదర్శిస్తూ నృత్యాలు చేశారు.



నూతన కార్యవర్గ సభ్యులు

విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం

అన్నవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ జగ్గంపేట డివిజన్ బీసీ ఉద్యోగుల సంఘాన్ని ఆదివారం అన్నవరంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జూరెడ్డి రాజబాబు, కార్యదర్శిగా పి.నాగేశ్వరరావు, కోశాధికారిగా సతీష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అమీర్ వ్యవహరించనున్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు, డిస్కం అధ్యక్షుడు సాయిబాబా ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షుడు రాజబాబు మాట్లాడుతూ బీసీ ఉద్యోగులను సంఘటితం చేసి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో కొటాన రాంబాబు, మురళీకృష్ణ, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీకి 10 లక్షలు విరాళం ఇస్తున్న దృశ్యం

'గేమ్ చేంజర్' మూవీ ప్రీ రిలీజ్

జగ్గంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): లండన్‌లో జరిగిన రామ్‌చరణ్ గేమ్ చేంజర్ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను జగ్గంపేట-కాట్రావులపల్లి వెళ్లే రోడ్డులో పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఎన్ఆర్ఐ కల్లేపల్లి రాజేష్ ఆధ్వర్యంలో ప్రసారం చేశారు. జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) హాజరయ్యారు. గేమ్ చేంజర్ మూవీ గ్రాండ్ సక్సెస్ అవ్వాలని వేంకటేశ్వరస్వామి కమిటీకి రూ.10,77,777 విరాళాన్ని రాజేష్ కుటుంబీకులు అందజేశారు. మెగా అభిమానులు, జనసేన కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ జనరల్ బాడీ సమావేశం

జగ్గంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఏరియా టైల్స్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జనరల్ బాడీ సమావేశాన్ని బాలాజీ టైల్స్ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మరుకుర్తి ఏసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు గంటా బాలరాజు, కంపెనీ నాగేశ్వరరావు, ఎస్.శ్రీను తదితరులు శ్రీను పాల్గొన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.





అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న లిబరేషన్ కార్యకర్తలు

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

ప్రత్తిపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యకర్తలు ధర్మవరంలో ఆందోళన నిర్వహించారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించి అరెస్ట్ చేయాలన్నారు. మానుకొండ లచ్చబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

సోమవరం ఎత్తిపోతల పథకం నుంచి నీటి విడుదల



కిర్లంపూడి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్లో రైతులకు నీళ్ల అందించేందుకు కిర్లంపూడి మండలం సోమవరం ఎత్తిపోతల పథకం (పంపింగ్ స్కీమ్) నుంచి టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ విడుదల చేశారు. అనంతరం సోమవరం ఎత్తిపోతల పథకం నీటి సంఘం అధ్యక్షుడు జ్యోతుల కోటి అధ్యక్షతన జరిగిన సమావేశానికి నవీన్, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన నీటి సంఘాల అధ్యక్షులను, చైర్మన్లను, వైస్ చైర్మన్లను, డైరెక్టర్లను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జడ్పీటీసీ తోట గాంధీ, ఏలేరు ప్రాజెక్టు డివిజనల్ ఇంజనీర్ గవరయ్య, డీసీలు నీలం శ్రీను, లింగంపర్తి రాజు, టీడీపీ నాయకులు జట్ల వీరబాబు, గంగిరెడ్ల దొరబాబు, మంచికంటి శ్రీను, కొప్పుల వీర్రాజు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థినులు

ఘనంగా మేథ్స్ డే

వై.రామవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పి.యర్రగొండ గురుకుల బాలికల కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ ఆధ్వర్యంలో మేథ్స్ డే జరిపారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు వివిధ గణిత అంశాలను ప్రదర్శించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'జీవిత గమ్యాన్ని రూపొందించేది గణితమే'

కాకినాడ రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరికీ జీవిత గమ్యాన్ని రూపొందించేది గణితమేనని జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ అన్నారు. ఎంఎస్ఎన్ ఛారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఆదివారం కౌశల్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాస్ అధ్యక్షతన పాఠశాల విద్యాశాఖ, యంగ్‌మైండ్స్, విజ్ఞానభారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు గణిత రంగోలి, క్విజ్ అంశాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.